JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 307 26 శుక్రవారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## ప్రక్క జిల్లాలకు ఎల్.ఎం.డి.నీరు కరీంనగర్ ప్రజలకు కన్నీళ్లా ?

**జనసైన్యం సిటి**

కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ లో ఉన్న నీటిని ప్రక్క జిల్లాలకు తరలించి కరీంనగర్ ప్రజలు త్రాగునీటికి కష్టాలను,కన్నీళ్లను చవిచూడాల్సి వస్తుందని,కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు,కుంటలు కబ్జాలకు గురవుతున్నా అధికారులు పాటించుకోవడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. నగరంలో త్రాగునీటి ఎద్దడిని నివారించాలని,విలీన గ్రామాల కుంటలు,చెరువులను కాపాడాలని గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. త్రాగునీటి కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ఖాళీ బిందెలతో విన్నూతనంగా నిరసన తెలపడానికి సిపిఐ నాయకులు,కార్యకర్తలు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. నాయకులకు పోలీసులకు కొద్దిసేపు తోపులాట జరిగింది.అనంతరం సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తలాపున నీళ్ళున్నా చాప దూపకు ఏడ్చినట్టు కరీంనగర్ లో మానేరు డ్యామ్ ఉన్నప్పటికీ ప్రజలు త్రాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఎండా కాలంలో ప్రజలకు నీరందక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్ల లల్లో నీరు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని,నగర వ్యాపితంగా ఎటు చూసినా,ఏ డివిజన్ కు వెళ్లినా ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీరు కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుకు ప్రధాన కారణం అధికారులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వక పోవడమేనని,స్థానిక ఎమ్మెల్యే







బి.ఆర్.ఎస్.పార్టీ,స్థానిక ఎంపీ బి. జె. పి పార్టీ,అటు కాంగ్రెస్ పార్టీకి ప్రజాప్రతినిధి లేకపోవడం ఇలా నాయకుల ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం వారికి సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడమేనని,కరీంనగర్ ప్రజల దాహార్తి తీర్చే నాథుడే కరువయ్యాడని శ్రీనివాస్ ఆరోపించారు. ఇటీవలి కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు,కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని,రియల్ ఎస్టేట్ వారు వాటిని కబ్జాలు చేస్తున్నారని,ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారని,ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని కొరవడిందని,ఇప్పటికైనా అటు మున్సిపల్ అధికారులు,ఇటు రెవెన్యూ అధికారులు నగర ప్రజల త్రాగునీటి కష్టాలను,భూముల కబ్జాలను నిలువరించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలు నిర్వహించక తప్పదని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బీర్ల పద్మ, కొట్టె అంజలి, మచ్చ రమేష్,శాఖ కార్యదర్శులు బాకం ఆంజనేయులు,గామినేని సత్యం చెంచల మురళి,నగునూరి రమేష్,కాల్వ శ్రీనివాస్ ,ఈ.భారతి,కేంసారం శ్రీనివాస్, అల్లేపు రాజు, నునావత్ శ్రీనివాస్, మామిడిపల్లి హేమంత్ కుమార్, మమత,స్రవంతి, దానవేణి రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో 23వ ర్యాంకు సాధించిన ఓద్యారం పాఠశాల



**జనసైన్యం సిటి**

తన చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ ఓద్యారం SHVR-2025-26 జాతీయ స్థాయి రేటింగ్‌లో దేశంలో 23వ ర్యాంకు, తెలంగాణలో 5వ ర్యాంకు సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం తన క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం గంగాధర మండలానికే కాకుండా మొత్తం చొప్పదండి నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మల వంటివని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. 2017-18లో పాఠశాల రాష్ట్ర స్థాయి అవార్డు సాధించినప్పుడు కూడా తాను ఎంతో సంతోషించానని, ఇప్పుడు అదే పాఠశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఒక చిన్న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు.జడ్పీహెచ్ఎస్ ఓద్యారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల చూపుతున్న కృషి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతినిధులు పాల్గొన్నారు.“రాష్ట్ర స్థాయి గుర్తింపు ఆనందాన్ని ఇచ్చింది... జాతీయ స్థాయి విజయం గర్వాన్ని కలిగించింది. ప్రభుత్వ పాఠశాలలే దేశానికి నిజమైన పట్టుకొమ్మలు” అని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం పేర్కొన్నారు.



## పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్



**జనసైన్యం సిటి**

తిమ్మాపూర్: కోర్టుల్లో ఎక్సామినర్, కాపీయిస్టు, ప్రాసెస్ సర్వర్ పోస్టులకు సంబంధించి జరుగుతున్న అర్హత పరీక్షలో ఓ అభ్యర్థి ఎగ్జామినేషన్ హాల్కే మొబైల్ ఫోన్ తీసుకెళ్లిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఓ పరీక్ష కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కోర్టుల్లో పలు పోస్టులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగిన పరీక్షలో సిద్దిపేట ప్రాంతానికి చెందిన ఓ అభ్యర్థి తన వెంట మొబైల్ ఫోన్ ను పరీక్ష కేంద్రం లోకి తీసుకెళ్లాడు. కాగా పరీక్ష మరో 10 నిమిషాల్లో ముగుస్తుందనగా అభ్యర్థి తన వెంట తెచ్చుకున్న మొబైల్ ఫోన్ ను తీసి పలు ప్రశ్నలకు సంబంధించిన జవాబులను వెతుకుతున్న క్రమంలో ఇన్విజిలేటర్ అతన్ని పట్టుకుని మొబైల్ ఫోన్, ప్రశ్నపత్రం లాక్కోవడంతో తరలించారు.ఇదిలా ఉండగా కోర్టు ఉద్యోగాలకు సంబంధించి జరుగుతున్న పరీక్షల్లో న్నత స్థాయి భద్రత ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించడం తోనే అభ్యర్థి తన వెంట మొబైల్ ఫోన్ ను పరీక్ష కేంద్రం లోకి తీసుకెళ్లాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఓ పరీక్షకు కూడా ఓ వైపు పరీక్ష జరుగుతుంటే మరీ వైపు డీజే సౌండ్ పెట్టి విద్యార్థులు నృత్యాలు చేసినట్లు అప్పట్లో అభ్యర్థులు ఆరోపించారు.అయితే తాజా ఘటన విషయమై అటు కళాశాల యాజమాన్యం గానీ ఇటు పరీక్ష నిర్వాహకులు గాని అభ్యర్థికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించలేదు.



ప్రదీప్ కుమార్ స్వాతి దంపతులకి పెళ్లి రోజు శుభాకాంక్షలు



రడం ప్రవీణ్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు



శ్రీరాముల సురేష్ కు జన్మదిన శుభాకాంక్షలు

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలనుపరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**జనసైన్యం సిటి**

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం .వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఇద్దరి కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం నేడు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. మృతుల కుటుంబాలకు తనవంతుగా ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గంగాధర మండలం, ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన లంకెదాసరి మల్లయ్య (55) ఈ నెల 10వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, 10 రోజులు మృత్యువుతో పోరాడి నేడు చికిత్స పొందుతూ మృతిచెందారు. చొప్పదండి మండలం, ఆర్నకొండకు చెందిన గుంట మహేష్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుండి వేగంగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. స్థానికులు వెంటనే మహేష్‌ను కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తరలించగా, తీవ్ర గాయాల కారణంగా చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం గారు హుటాహుటిన కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతులు లంకెదాసరి మల్లయ్య, గుంట మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇరు కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినారు. "ఈ కష్ట సమయంలో మీకు కాంగ్రెస్ పార్టీ, నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ధైర్యంగా ఉండండి. ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తాను" అని మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే గభరోసా ఇచ్చారు. మేడిపల్లి సత్యం గారితో పాటు చొప్పదండి, గంగాధర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వృత్తుల కుటుంబాలను పరామర్శించారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ పై దుష్ప్రచారం మానుకోవాలి



**జనసైన్యం సిటి**

చొప్పదండి నియోజకవర్గం లో నేడు బూత్ లెవల్ అధికారులు ఓటర్ల గృహాలు సందర్శించి వారికి ఎస్ఐఆర్ ఫారంలు అందిస్తూ అవగాహన కల్పించారు. చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగంపేట తాజా మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి .తన కుటుంబ సభ్యుల యొక్క ఎస్ఐఆర్ ఫారం లు నింపి అధికారులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ వల్ల ఓట్లు పోతాయని ఇటీవల ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటే కేవలం బంగ్లాదేశీ రోహింగ్యాల ఓట్లు కాపాడటం కోసం కోసం పొన్నం ప్రభాకర్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు .మహారాష్ట్రలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు గవర్నర్ ను, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఎస్ఐఆర్ మరింత పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారని చేశారు.కేరళలో డూప్లికేట్ ఓట్లు తగ్గిపోవడం వలన కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగిందని శశి థరూర్ పేర్కొన్నారని సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ ను సమర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేసిన పిటిషన్లు కొట్టి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన ఏస్ఐ ఆర్ లో ఏ ఒక్క అర్హుడైన ఓటర్ తన ఓటు కోల్పోయిన దాఖలా లేదని కేవలం మరణించిన వారివి, మరియు రెండు సార్లు నమోదు అయిన డూప్లికేట్ ఓట్లు మాత్రం తగ్గుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అంతేకాక ఎస్ ఐ ఆర్ లో పాల్గొనే ఎన్నికల అధికారులు బిఎల్వోలు సూపర్వైజర్లు, మండల డివిజనల్ జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, వీరు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పని చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని మరి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేసే ఓట్లపైన రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారికే విశ్వాసం లేకపోవటం విడ్డూరమని సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చొప్పదండి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీ పెరుక శ్రావణ్ కుమార్, గుండె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

**జనసైన్యం సిటి**



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎస్. శివకుమార్ గారి అనుమతితో, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు న్యాయమూర్తి శ్రీమతి కె. రాణి ఆదేశాల మేరకు విద్యార్థులకు ముందస్తు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని మంకమ్మతోట కాకతీయ స్కూల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, ప్యానల్ అడ్వకేట్స్ చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, సకినాల ప్రవీణ్ కుమార్, ఏ. కిరణ్ కుమార్, ఎస్.వి.ఆర్ కృష్ణ, పెరుక రంగయ్యలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక దుష్పరిణామాల గురించి వారు విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. దేశ భవిష్యత్తు కోసం నేటి విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని వారు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలు చట్టరీత్యా అత్యంత తీవ్రమైన శిక్షార్హమైన నేరాలని తెలిపారు. వీటి నివారణలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా తమ అమూల్యమైన సమయాన్ని విద్య, క్రీడలు, పుస్తక పఠనం మరియు సృజనాత్మక కార్యక్రమాలపై కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాగర్ రావు, పారా లీగల్ వాలంటీర్ రేష్మ, శ్రీలతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాల మహిమ



గోడ
గడియారాన్ని చూస్తూ..
నిష్క్రియగా నిలబడకు నేస్తం
సమయం అనంత ప్రవాహం
కాలంతో పాటు సాఫీగా సాగడం
సమయంతో పోటీ పడడం
కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం
సమయానికి విలువనివ్వడం
కాలాన్ని నేస్తంగా మార్చుకోవడం
కాలయాపనకు అడ్డుకట్ట వేయడం
కాల ప్రవాహంతో ఓర్పుగా కదలడం
కాల కఠిన పరీక్షలో నేర్పుతో నెగ్గడం
కాలం శత్రువులా కత్తి దూస్తుంది
అదే కాలం కనకవర్షం కురిపిస్తుంది
విశ్వ విజేతలను చేసి తీరుతుంది !

కాలంతో పరుగిడితేనే..
సకాలంలో గమ్యం చేరవచ్చు
కాల గమనాన్ని చూస్తూ..
ఆశ్చర్యంగా చూస్తూ కూర్చుంటే..
వయసు వడివడిగా పెరుగుతూ..
వృద్ధాప్యం వేగంగా వస్తూ..
వైఫల్య బతుకు వెక్కిరిస్తూ..
సుదీర్ఘ బతుకు భారమై..
జీవితం నిరర్ధకం అవుతూ..
నీ అలసత్వానికి వెక్కిరిస్తూ..
కాలం తన ప్రతాపాన్ని చూపిస్తూ..
నిండు నూరేళ్ల బతుకు అవుతుంది
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే !

మధుపాళీ

## రేషనలైజేషన్, సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలి.



**జనసైన్యం సిటి**

ప్రభుత్వ పాఠశాలల కుదింపు ఉపాధ్యాయుల రేషనలైజేషన్ సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు M.A. ఖాద్రీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఈసందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో, ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికొక టీచర్ను నియమించి బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా, పాఠశాలల కుదింపు, ఉపాధ్యాయుల రేషనలైజేషన్ యోచనలో ప్రభుత్వం ఉండడం సరికాదని అన్నారు. జనగణన రెండో ఫేజ్ విధుల్లో ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు వచ్చే ఫిబ్రవరిలో ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య దూరం అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడిప్పుడే పాఠశాలల్లో అడ్మిషన్లు అవుతుండగా విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాలల ఎంపికలో ఉండగా ఉపాధ్యాయుల సర్దుబాటు సరికాదని వచ్చే నెలలో చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాను ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, పీఆర్సీ నివేదిక తెప్పించి వెంటనే చర్చలకు పిలిచి మెరుగైన ఫిట్మెంట్తో అమలు చేయాలని పెండింగ్లో ఉన్న ఐదు డిఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ మున్సిపల్ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణ



**జనసైన్యం సిటి**

నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నూతన ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మరియు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం స్థానిక కార్పొరేటర్ టింకు, కార్పొరేటర్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మరియు సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మున్సిపల్ నిధులతో ఈ ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను మరింత సురక్షితంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్మాణం దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ పోలీస్ శాఖకు, మున్సిపల్ కార్పొరేషన్‌కు మధ్య ఇదే రకమైన సమన్వయం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్ళజోళ్ల పంపిణీ:

శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, నిరంతరం రోడ్లపై ఉంటూ ఎండ, ధూళిని లెక్కచేయక విధి నిర్వహణలో నిమగ్నమయ్యే ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టారు. సిబ్బంది కంటి ఆరోగ్య రక్షణకై సీపీ గౌష్ ఆలం చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి చలువ కళ్ళజోళ్లను (కూలింగ్ గ్లాసెస్) అందజేశారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణకు కట్టుబడి పనిచేస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల ఉచ్చులో యువ భారతం

డాక్టర్ : మధుసూదన్ రెడ్డి బుర్ర

(26 జూన్ "అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం" సందర్భంగా)



ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్లకు పైగా ప్రజలు, ముఖ్యంగా యువత (15 - 64 ఏండ్లు), మాదకద్రవ్యాల దురలవాట్ల విష వలయంలో చిక్కుకొని విలవిల్లాడుతూ, పలు సవాళ్లకు/సమస్యలకు తెర లేపుతున్నారు. గత దశాబ్ద కాలంలో కన్నాబిస్ ఆధారిత డ్రగ్స్ అక్రమ వినియోగం 25 శాతం పెరగడం ఓ ప్రమాదకర హెచ్చరికగా తీసుకోవాలి. మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం సాలీనా 400 బిలియన్లు దాటడంతో పాటు నేరాలు, ఘోరాలు, అవినీతి, హింస, వింతపోకడలు, మానవ అక్రమ రవాణా, తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. దినదినం అత్యంత ప్రతికూల ప్రభావం లేదా దుష్ప్రభావం కలిగిన డ్రగ్స్ మార్కెట్‌లో పలు రూపాల్లో విచ్చలవిడిగా ప్రత్యక్షం కావడం, యువతతో పాటు పాఠశాల పిల్లలు కూడా దురలవాట్లకు తలవంచడంతో పలు ఆందోళనకర అనారోగ్యాలకు, చివరికి ప్రాణాలు పోయే దుస్థితికి చేరడం చూస్తున్నాం. ఇలాంటి అవాంఛనీయ విష వలయాలు పేదరికాన్ని, అశాంతిని పెంచుతున్నాయి.

### అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం-2026 ఇతివృత్తం:

ప్రమాదకర, ప్రాణాంతక మాదక ద్రవ్యాల దురలవాట్ల పట్ల సామాన్య జనాల్లో అవగాహన కలిగించడానికి ప్రతి ఏట 26 జూన్ రోజున ఐరాస - డబ్ల్యూహెచ్ఓ చొరవతో "అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం (ఇంటర్నేషనల్ డే అగెనిస్ట్ డ్రగ్ అబ్యూజ్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్) లేదా ప్రపంచ మాదకద్రవ్యాల దినం"ను పాటించడం 1988 నుంచి ఆనవాయితీగా మారింది. మాదక ద్రవ్యాల నిర్మూలనతో విద్య, ఆరోగ్యం, న్యాయం, ప్రత్యామ్నాయ జీవనోపాధులు సుసాధ్యం అవుతున్నాయి. మాదక ద్రవ్యాల దుర్వినియోగంతో పాటు వాటి అక్రమ రవాణా కట్టడి, అనైతిక యంత్రాంగాలను ఛేదించడం, డిమాండ్ సప్లై లేకుండా చేయడంతో సామాజిక ఆర్థిక ప్రగతి సుసాధ్యం అవుతుంది. మాదక ద్రవ్యాల దుర్వినియోగంతో పాటు అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వాలు, ఎన్‌జిఓ సంస్థలు, పౌర సమాజం సమన్వయంతో ముందుకు సాగుతూ, డ్రగ్స్ లేని ప్రపంచాన్ని నిర్మించాలనే ప్రయత్నాలను ముమ్మరం చేయాలి.

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం-2026 ఇతివృత్తంగా "ప్రపంచవ్యాప్త మాదక ద్రవ్యాల సమస్య : నిరంతర సమస్యలు, నూతన సవాళ్లు, వినూత్న ప్రతిస్పందనలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

### మాదక ద్రవ్యాల దురలవాట్ల దుష్ప్రభావాలు:

ముఖ్యమైన మాదక ద్రవ్యాల జాబితాలో స్టిమ్యులెంట్స్ (కొకైన్ లాంటివి), డిప్రెసెంట్స్ (ఆల్కహాల్ లాంటివి), పెయిన్ కిల్లర్స్ (హెరాయిన్ లాంటివి), హాలూసినోదెన్స్ (ఎల్ఎస్‌డి లాంటివి) వర్గాలు వస్తాయి. మాదక ద్రవ్యాల్లో మరుజువానా, ఓపినాయిడ్స్, కొకేయిన్, ఆల్కహాల్, ఆంఫిటమైన్స్, కన్నాబిస్, ఏటిఎస్, సెడెటివ్స్, ఇన్హలెంట్స్, హాలూసినోయిడ్స్ మొదలగునవి వస్తాయి. మదక ద్రవ్యాల దుర్వినియోగ వలయంలో చిక్కిన అభాగ్యులకు శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. డ్రగ్స్ వాడకం పెరిగితే గుండె జబ్బులు, స్ట్రోక్, ఊపిరితిత్తులు-నోటి క్యాన్సర్స్, హెచ్ఐవి, హెపటైటిస్, శ్వాస ఇబ్బందులు, కాలేయం/మూత్ర పిండాల సమస్యలు, బరువు తగ్గడం, నిద్రలేమి, అనవసర ఆవేశం, ఆందోళన, టీబీ, జ్ఞాపక శక్తి, తడబాటు, చులకన కావడం, కుటుంబ సంబంధాల విచ్ఛిన్నం, చివరికి మరణం లాంటి పలు ఇతర సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. భారతంలో 14.6 శాతం మంది ఆల్కహాల్‌ను, 2.8 శాతం కన్నాబిస్ ఉత్పత్తులను, 2.06 శాతం ఓపినాయ్స్‌ను, 1.08 శాతం సెడేటివ్స్‌ను వాడుతున్నట్లు తేలింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, అస్సాం, మిజోరాం, మణిపూర్, సిక్కిం, యూపీ రాష్ట్రాల్లోనే సగానికి పైగా డ్రగ్స్ వినియోగదారులు ఉన్నట్లు తేలింది.

మాదక ద్రవ్యాల దుర్వినియోగాల కట్టడికి భారత ప్రభుత్వం "నిషా ముక్త్ భారత్ అభియాన్, డ్రగ్ డీ-అడిక్షన్ కేంద్రాలు, ఎన్‌సిబీ, కోసుకున్న యువతలో నైపుణ్యాలు లేదా సామర్థ్యం పెంచడం లాంటివి కొనసాగాలి. విద్యాలయ పరిసరాల్లో డ్రగ్స్ దొరక్కుండా గస్తీలను పెంచి, మత్తులో జీవితాలను చిత్తు చేసుకోకుండా, మాదక ద్రవ్యాలు మానవ ప్రగతికి ప్రతిబంధకాలని తలిచి, రేపటి ఆరోగ్యకర పౌర సమాజ స్థాపనకు నేడే పునాదులు వేద్దాం, "నో టు డ్రగ్స్" అంటూ యువభారతం నినదించాలి.

# కత్తి జయలక్ష్మికి ఇంటర్నేషనల్ బెస్ట్ రైటర్ అవార్డు



**జనసైన్యం సిటి**

CPM Peace Maker Organisation ద్వారా కత్తి జయలక్ష్మిగారికి 100 సోషల్ అవేర్‌నెస్ ఆర్టికల్స్ కి గాను "ఇంటర్నేషనల్ బెస్ట్ రైటర్ అవార్డు" సన్మానం.

కనిగిరి: CPM Peace Maker Organisation సభ్యురాలు, M.Sc సైకాలజీ & స్పెషల్ ఎడ్యుకేటర్ అయిన కత్తి జయలక్ష్మి గారికి సామాజిక స్పృహతో కూడిన సేవలకు గుర్తింపుగా C P M Peace Maker Organisation ద్వారా "ఇంటర్నేషనల్ బెస్ట్ రైటర్ అవార్డు" ప్రదానం చేయడం జరిగింది.

గత కొంత కాలంగా ఆమె ఫ్యామిలీస్, స్టూడెంట్స్, యూత్, కవిత, మానసిక వైకల్యాలు, ఇంటలెక్చువల్ డిజేబులిటీ, దివ్యాంగుల సంక్షేమం, భార్యాభర్తల బంధం, విద్యా విధానం, వివాహాల వల్ల వచ్చే నష్టాలు, వైట్ ఎల్లిఫెంట్ ఖర్చుల నిరోధం వంటి అనేక అంశాలపై దాదాపు 100 ఆర్టికల్స్ రచించి సమాజంలో చైతన్యం తీసుకువచ్చారు.

విద్యార్హతలు: M.Sc సైకాలజీ, M.A English Literature, Intellectual Disability Special http://B.Ed


ఈ సన్మాన కార్యక్రమంలో Bishop Wilson Singham Garu, భాస్కర్ ముల్లా , సురేష్ మనోహర్ , సుందర్ పాల్ , ఎస్తేర్ రాణి పాల్గొని కత్తి జయలక్ష్మికి ఇంటర్నేషనల్ అవార్డు అందజేసి, మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేయాలని ప్రోత్సహించారు.

ఆమె రచనలు కేవలం వ్యాసాలుగా కాకుండా, ప్రజల మనసుల్లో మార్పు తీసుకువచ్చే ఆయుధాలుగా నిలిచాయి.

CPM Peace Maker Organisation Ever Revered & Respected Bishop Ayyagaru నాయకత్వంలో "అహంకారం లేని, మచ్చలేని ఐక్యత" స్ఫూర్తితో సమాజంలో శాంతి, న్యాయం, అవగాహన కోసం కృషి చేస్తోంది. కత్తి జయలక్ష్మి వంటి యువ ప్రతిభ C P M కి, దేశానికి గర్వకారణం.

"మానసిక వైకల్యం ఉన్న ప్రతి బిడ్డకి సమాజంలో స్థానం కల్పించాలన్నదే నా లక్ష్యం. CPM ఇంటర్నేషనల్ అవార్డు నాకు మరింత బాధ్యత పెంచింది. ఇది ఒక ముగింపు కాదు, మరింత సేవకు నాంది" అని కత్తి జయలక్ష్మి పేర్కొన్నారు.

# కవిని కాదు రవిని నేను!



కవిత్వంలో నవీనత్వం కావాలి,
రాజులను పొగిడే రచనలు పోవాలి!
నీకు ఎలాంటి కవిత్వం కావాలి...?
తప్పును ఎదిరించే ప్రశ్న కావాలి,
కుశల ప్రశ్నల రాతలు పోవాలి!
కలంలోంచి కవితల జల్లె కురవాలి,
పొలంలోంచి రైతుకలల పంటై పండాలి!
కవిత్వంలో నవీనత్వం కావాలి,
కళ్ళబొల్లి, చిల్లర మల్లర రాతలు పోవాలి!
నీకు ఎలాంటి కవిత్వం కావాలి...?
రాస్తే సమాజంలో మార్పు రావాలి,
ప్రవహించే కలాన చైతన్యం మురవాలి,
అది చదివి నరాలకు నవబిగువు రావాలి!
కవిత్వంలో నవీనత్వం కావాలి,
లక్ష్యం లేని లేఖనం పోవాలి!
నీకు ఎలాంటి కవిత్వం కావాలి...?
అవసరం లేని అక్షరాల పొందిక పోవాలి,
సారమైన ప్రశ్నల గొంతుక కావాలి!
అపారమైన అనుభవాల కాసారం నిండాలి,
సామాజిక రుగ్మతలకు వ్యాక్సిన్ లా మారాలి!

# డిజిటల్ యుగంలోన కొనసాగుతున్న అమానవీయ చిత్రహింసలు

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

(26 జూన్ "ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం" సందర్భంగా)






చిటికెడు రుణం కోసం వెట్టిచాకిరీ దురాచారాలు, బాల కార్మికుల శ్రమను దోచే సంపన్న కుసంస్కారులు, ఆలి నోట్‌లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు చేస్తున్న మనసులేని భర్తలు, దినదినం అమానవీయ చిత్రహింసలకు గురవుతున్న అభాగ్యులు ఎందరో నిశ్శబ్దంగా రోధిస్తున్నారు, ఓదార్పుకి ఆమెడ దూరం అవుతున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, సంక్షోభాలు, తీవ్ర విపత్తుల నడుమ మిలియన్ల కొద్ది ప్రజలు ఇప్పుడు కూడా చిత్రహింసలను అనుభవించడం కొనసాగుతున్న వేళ ప్రపంచ దేశాలు ప్రతి ఏట 26 జూన్‌న "ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం (యూఎన్ ఇంటర్నేషనల్ డే ఇన్ సపోర్ట్ ఆఫ్ విక్టిమ్స్ టార్చర్)" పాటించడం ఆనవాయితీగా మారింది. సరైన కారణం లేకుండా అమానవీయంగా, ఉద్దేశ పూర్వకంగా హింసించడం లేదా బాధ పెట్టడాన్ని 'టార్చర్' లేదా 'చిత్రహింస'గా నిర్వచిస్తారు.

**ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం-2026 ఇతివృత్తం:**

చిత్రహింస పెట్టడం నేరమని, మానవ హక్కులను హరించడం అమానవీయమని, చిత్రహింసలు బాధితుల కనీస జీవించే హక్కులను కాలరాస్తున్నారని, వ్యక్తిత్వ హననం జరుగుతున్నదని తెలుసుకోవాలి. నేడు కనీసం వందకు పైగా సాయుధ పోరాటాలు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో అన్ని వయస్సుల ప్రజలు చిత్రహింసలకు గురవుతున్నారని అర్థం అవుతున్నది. ఐరాస ఏర్పాటు చేసిన 'చిత్రహింస బాధితుల స్వచ్ఛంద నిధి' ద్వారా ప్రతి ఏట కనీసం 50,000 మంది బాధితులకు న్యాయ, మానవీయ, మానసిక, వైద్య అవసరాలకు చేయూత ఇవ్వడం కొనసాగుతున్నది. స్వేచ్ఛకు దూరంగా నిర్బంధాల వలలో చిక్కుకున్న వారు, పిల్లలు-కౌమార యువత, శరణార్థులు, వలసదారులు, ఆదివాసీ జాతులు, లౌంగిక - లింగ ఆధార హింస బాధితులు లాంటి మిలియన్ల అభాగ్యులు నేడు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అల్పాదాయ దేశాల్లో చిత్రహింసలు కొనసాగుతున్నాయి. ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం-2026 ఇతివృత్తంగా "చిత్రహింస : మానవత్వానికి వ్యతిరేకంగా నేరం (టార్చర్ : ఏ క్రైమ్ అగెనెస్ట్ హుమానిటీ)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

**అల్పాదాయ దేశాల్లో అధిక చిత్రహింసల నమోదు:**

చిత్రహింస బాధితులు అధికంగా శ్రీలంక, ఇరాన్, ఇరాక్, అఫ్ఘానిస్థాన్, కాంగో, సూడాన్, ఇథియోపియా, టర్కీ, సిరియా లాంటి దేశాల్లో ఉన్నట్లు వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటువంటి అభాగ్య చిత్రహింస బాధితులకు మద్దతుగా ప్రజల్లో అవగాహన పెంచడం, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం, వారికి మానవ హక్కులు కల్పించడం, సామాజిక మాద్యమాల వేదికగా బాధితుల పక్షాన గళాలు విప్పడం, బాధితుల పరిరక్షణ చట్టాలకు పదును పెట్టడం, బాధితుల జీవిత గాథలను వినిడం లాంటివి ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం వేదికగా జరగాలి. చిత్రహింస బాధితులు దీర్ఘకాలిక మానసిక సమస్యలు, ఆందోళనలు, నిరాశలు, ఒత్తిడులు, నొప్పులు, తలనొప్పి, శ్వాస ఇబ్బందులు లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని గమనించాలి.

ప్రతి ఒక్కరు కనీస గౌరవాన్ని, మర్యాదను పొందడానికి అర్హులని తెలుసుకోవాలి. ఇలాంటి చిత్రహింస బాధితులకు మద్దతుగా నిలుస్తూ, అవసర చేయూతను అందిస్తూ, స్వేచ్ఛను బహుకరిస్తూ, మానవీయతను బతికిస్తూ వారి జీవితాల్లో సానుకూల మార్పులకు కారణం కావాలి. ఇలాంటి చిత్రహింసలు జరగకుండా చూసుకోవడం, బాధితులకు అండగా నిలవడం మన కనీస కర్తవ్యమని తెలుసుకుందాం, చిత్రహింసలు లేని పౌర సమాజాన్ని నిర్మించుకుందాం.



# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన

**ఫోన్ నెంబర్**

**9246966660**






## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

## ట్రాప్ చేస్తుంది..నరకం చూపిస్తుంది..!



**జనసైన్యం సిటి**

పరువు బజారున పెడుతుంది..!కోట్లలో ఇన్సూరెన్స్ చెయ్యమంటుంది..!నామినీగా తనపేరు పెట్టమంటుంది..!తర్వాత చంపేసి ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేద్దామని ప్లాన్ చేస్తుంది..మహిళ ఉచ్చులో ఇప్పటికే ముగ్గురు..!తాజాగా రైల్వే ఉద్యోగి ఆత్మహత్య..! నరకం.చూపించి అతన్ని చచ్చిపోయేలా చేసిన ఉన్మాద మహిళ..!మ్యాట్రిమోనీ సైట్స్ లో తప్పుడు వివరాలతో నమోదు చేసుకుని.. కాస్త డబ్బు మంచి ఉద్యోగం ఉనవాళ్ళనే టార్గెట్ చేస్తున్న ఉన్మాది..!మహిళ ట్రాప్‌లో పడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య తిరుపతి జిల్లా రేణిగుంటలో దారుణ ఘటన..!మహిళా సంఘం నాయకురాలు ఉషారాణి వేధింపులు భరించలేక రైల్వే ఉద్యోగి రవి ఆత్మహత్య..!రేణిగుంట బుగ్గ వీధిలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన రవి..!మూడు పెళ్లిళ్లు చేసుకుని, మహిళ సంఘం ముసుగులో రైల్వే ఉద్యోగి రవిని ట్రాప్ చేసిన ఉషారాణి..!తూర్పుగోదావరి జిల్లా కడియంకు చెందిన రవితో మూడేళ్ళు సహజీవనం చేసిన ఉషారాణి..!మూడు పెళ్లిళ్లు విషయం తెలుసుకుని జాగ్రత్త పడ్డ రవి..!రైల్వే సర్వీస్ రికార్డులో తన పేరు నామినిగా పెట్టాలని, రూ.కోటి ఇన్సూరెన్స్ పాలసీ నామినిగా పెట్టాలని వేధించిన ఉషారాణి..!ఉషారాణి వేధింపులుపై రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేసిన రైల్వే ఉద్యోగి రవి..!మహిళా సంఘం, సీపీఐ నాయకులతో రాజీ చేసుకోవాలంటూ పోలీసుల సలహా ఇచ్చినట్టుగా తెలిపిన రవి..!ఈరోజు మధ్యాహ్నం రేణిగుంట బుగ్గవీధిలో ఆత్మహత్య చేసుకున్న రవి..!మ్యాట్రిమోనిలో మరోసారి పెళ్లికి ఆన్‌లైన్ గాలం వేసిన ఉషారాణి..!ఉషారాణి గుట్టు మొత్తం సేకరించి పోలీసులకు ఇచ్చినా పట్టించుకోకపోవడం లేదని మనస్తాపంతో రవి ఆత్మహత్య..!ఉషారాణి వేధింపులు వల్లే ఆత్మహత్యకు పాడినట్లు సూసైడ్ నోట్ రాసి చనిపోయిన రైల్వే ఉద్యోగి రవి..!సూసైడ్ నోట్ లో తనపై తప్పుడు కేసులతో ఉషారాణి వేధింపులపై వివరంగా రాసిన రవి..!

## గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**జనసైన్యం సిటి**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా మంజూరైన అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీవో భవనాలు, ప్రహరీ, కిచెన్ షెడ్లు) వేగవంతం చేసి వెంటనే ఈనెల 30 లోగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈజీఎస్ పెండింగ్ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈజీఎస్ కింద మంజూరైన పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ గడువు తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలన్నారు. మంజూరైన పనులు ఆపకుండా తక్షణం గ్రౌండింగ్ చేసి ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు ఏఈలని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలోమస్టర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.సమావేశంలో డీఆర్డీఓ గీత, పంచాయతీరాజ్ ఈఈ జనార్ధన్, అదనపు డీఆర్డీఓలు, జిల్లాలోని ఆరు సబ్ డివిజన్ల పంచాయతీరాజ్ డీఈలు, 15 మండలాల ఏఈలు పాల్గొన్నారు.

## కోరా, జాన్సన్, ఎ.ఎన్.సి పాఠశాలల్లో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమాలు




**కొడిమ్యాల జన సైన్యం న్యూస్.**

నగరంలోని కోరా, జాన్సన్, ఎ.ఎన్.సి పాఠశాలల్లో జూన్ 26 సందర్భంగా అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరిస్తూ స్కిట్లు, ప్రసంగాలు, ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆలోచింపజేశారు.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ, సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ప్రమాదకరమైన పరిణామాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలవుతున్న యువత, విద్యార్థులను సరైన మార్గంలో నడిపించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఆస్కార్ నటి ప్రియా గోయల్



**జనసైన్యం సిటి**

కాబోయే భార్య చేతిలో హత్యకు గురైన బిజినెస్ మ్యాన్ కేతన్ అగర్వాల్ కేసులో స్టోరీ తెలిసి ఇప్పుడు అందరూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు .. ప్రియుడు కోసం కాబోయే భర్తను హత్య చేయించిన ప్రియాగోయల్ ను కాల్చి చంపాలని డిమాండ్ చేస్తున్నారు .ప్రయా గోయల్ తో ఎంగేజ్మెంట్ అయ్యాక ఆమెను ఎంతగానో ప్రేమించాడు .. అప్పటి వారిద్దరి వీడియోలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి .. ఆమె బర్త్ డే న ఇచ్చిన గిఫ్ట్ సహా ఆమెపై అతనికి ఉన్న ప్రేమని గుర్తు చేస్తున్నాయి .. అయ్యో ఇంతలా ప్రేమించినవాడిని ఎలా చంపాలనిపించింది అని జనాలు బాధపడుతున్నారు ..

పెళ్లి కోసం 17 కోట్లతో రాజస్థాన్ లో ప్యాలెస్ బుక్ చేసారు .. అయితే ఎప్పుడు తనకు కేతన్ తనకు ఇష్టం లేదనే విషయం చెప్పలేదు .. అలా చెప్పి ఉంటే ఇవాళ కేతన్ ప్రాణాలతో హ్యాపీగా ఉండేవాడేమో .. తనకు అతనంటే చాలా ఇష్టం అని చెప్పింది .. అంతేకాదు అతనితో కలిసి ఉన్న వీడియోల్లో సైతం అతనంటే ఎంతగానో ప్రేమ ఉన్నట్టు నటించింది ఎవరికీ అనుమానం రాకుండా .. తన మీద ఆమె చూపిస్తున్న ప్రేమకి కేతన్ కరిగిపోయాడు .ఎంగేజ్మెంట్ కూడా అయ్యాక తన ప్రియుడు చేతన్ చౌదరిని రంగంలోకి దింపింది . తన పుట్టినరోజు వేడుకల నెపంతో కేతన్‌ను లోహగఢ్ కోట వద్దకు తీసుకెళ్లి, వెనుక నుంచి 400 అడుగుల లోతైన లోయలోకి తోసి చంపేసింది .కేతన్‌కు, సియా గోయల్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఘనంగా నిశ్చితార్థం జరిగింది. నవంబర్‌లో జరగనున్న పెళ్లి కోసం రాజస్థాన్‌లోని ఒక లగ్జరీ ప్యాలెస్‌ను రూ.17 కోట్లకు బుక్ చేసి, అతిథుల కోసం రెండు చార్టర్డ్ విమానాలను కూడా సిద్ధం చేశారు.కాగా, జూన్ 18న సియా పుట్టినరోజు కావడంతో ఆమె కేతన్‌ను లోహగఢ్ కోటకు ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లింది. అయితే అక్కడ కేతన్ తనను ఫొటోలు తీస్తుండగా బలమైన గాలులకు పట్టుతప్పి లోయలో పడిపోయాడని



సియా పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపింది. పోలీసులు తొలుత ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా కేసు నమోదు చేశారు.కేతన్ మంచి ట్రెక్కర్ కావడంతో అంత సులభంగా కాలుజారి పడే అవకాశం లేదని కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. కేతన్ అంత్యక్రియలు జరిగిన నాలుగు రోజుల తర్వాత సియా వారి ఇంటికి వెళ్లినప్పుడు, అక్కడ కేతన్ సోదరి అడిగిన కొన్ని ప్రశ్నలకు ఆమె తడబడుతూ సమాధానాలు చెప్పడంతో అనుమానం బలపడింది.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. దర్యాప్తులో సియాకు పుణెలోని కొంధ్వాకు చెందిన చేతన్ బాబూలాల్ చౌదరి అనే యువకుడితో అక్రమ సంబంధం ఉన్నట్లు తేలింది. గత ఆరు నెలల్లో వీరిద్దరూ 2,004 సార్లు ఫోన్లలో మాట్లాడుకున్నట్లు గుర్తించారు.అంతేకాకుండా హత్య జరిగిన జూన్ 18న చేతన్ తన మొబైల్ డేటాను పూర్తిగా ఆఫ్ చేసి, తన ఫోన్‌ను సొంత షాపులోనే వదిలేశాడు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు తన షాప్ ఉద్యోగి ఫోన్ తీసుకుని రహస్యంగా లోహగఢ్ కోటకు చేరుకున్నాడు.పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. సియాకు ఈ పెళ్లి ఇష్టం లేకపోవడంతో, చేతన్‌తో కలిసి కేతన్‌ను వదిలించుకోవాలని పథకం వేసింది. జూన్ 14నే అతడిని కొండపై నుంచి నెట్టేయాలని ప్రయత్నించినా అది కుదరలేదు. దీంతో మళ్లీ జూన్ 18న బర్త్‌డే నెపంతో కొండపైకి తీసుకెళ్లి, వెనుక నుంచి లోయలోకి నెట్టేసి హత్య చేసినట్లు వెల్లడైంది.హత్య చేసిన తర్వాత ఏమీ తెలియనట్లు సియా ఇన్‌స్టాగ్రామ్‌లో కేతన్‌తో ఉన్న పాత వీడియోలను షేర్ చేస్తూ:

"నా పుట్టినరోజే నన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్లిపోయావు. నా గుండెకు తెలుసు నువ్వు ఇక్కడే ఉన్నావని, తిరిగి వచ్చేయ్"ఈ మహానటి యాక్టింగ్ కి ఆస్కార్ కూడా తక్కువే అంటున్నారు .. ఇప్పుడు ఆనే జైల్లో ఉంది .. ఆమె తల్లిదండ్రులు పరువు పోయి ఏడుస్తున్నారు .. ఆమె ప్రియుడు జీవితం నాశనమైంది . కేతన్ తల్లిదండ్రులు కొడుకుని తల్చుకుని కుమిలిపోతున్నారు .. ప్రియాగోయల్ కి వచ్చిన ఆ దుష్ట ఆలోచన ఇంతమంది జీవితాలతో ఆడుకుంది .. రెండు కుటుంబాల వాళ్ళు కోటీశ్వరులే .. పెద్ద వ్యాపారవేత్తలే .. కానీ ఏమీ ప్రయోజనం లేదు .. అంతా అయిపోయింది ...



# డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

ఓ యువత మేలుకో
మత్తు చల్లే మాయలో పడకు
పచ్చని జీవితాన్ని బలిచేసుకోకు
డ్రగ్స్ విషవలయంలో చిక్కుకొని
కన్న వారి కన్నీటికి కారణం కాకు
క్షణకాలం మత్తు కోసం
జీవితాన్ని నరకం చేసుకోకు
నీ ఆలోచనే దేశానికి భలం
యువ శక్తే జాతీయ శక్తి
డ్రగ్స్ వినియోగం సమాజానికి
దురాచారంగా ప్రభలింది
చదువుల గుడిలో డ్రగ్స్ భూతం
చేరింది ముక్కు పచ్చలారని
చిన్నారుల జీవితాలను చిదిమేసింది
యువత ఉజ్వల భవిష్యత్తును
బూడిద పాలు చేసింది
ఆలోచనల పదునును
మొద్దుబార్చేఈవ్యసనం
జీవచ్ఛవాల్లుగా మార్చే
ఒక మానసిక నరకం
సిరల్లో ప్రవహించాలి ప్రగతి రక్తం
కానీ సిరంజీల గుచ్చులతో
శుష్కించి పోతుంది శరీరం
కన్న వారి కలలు కరిగిపోతుంటే
మౌనమెందుకు?
జాతి యువ వనరులు
నాశనమౌతుంటే నిర్లక్ష్యం ఎందుకు?
డ్రగ్స్ కేంద్ర నాడీ వ్యవస్థ
పైప్రభావం చూపి మనిషిని
దీర్ఘకాలిక అనారోగ్య
సమస్యల పాలు చేస్తుంది
జీర్ణ వ్యవస్థ దెబ్బతిని
శరీరం శుష్కిస్తుంది
లివర్ పై ఒత్తిడి పెరిగి
పనిచేయని స్థితి వస్తుంది
గుండె వేగంలో మార్పులు
వస్తాయి గుండెపోటుతో
మరణాలు సంభవిస్తాయి
జ్ఞాపక శక్తి క్షీణిస్తుంది
ఒత్తిడి పెరిగి ఏకాగ్రత
హింసాత్మక ఆలోచనలు
పురుడు పోసుకోని
ప్రగతిని అడ్డుకుంటుంది
మెదడు దెబ్బతిని
మూర్ఛ వ్యాధి వస్తుంది
60 ఏళ్ల క్రితమే మనుషులు
మత్తుకు మరిగినట్లు చరిత్ర
చెబుతుంది
గంజాయి హీరోయిన్ వివిధ
రూపాల్లో లభించే డ్రగ్స్
పిల్లలు యువత విచ్చల
విడిగా వినియోగించి
డ్రగ్స్ బారిన పడి తమ
బంగారు భవిష్యత్తును
పాడు చేసుకుంటున్నారు
కుటుంబ పెద్దలు పిల్లలపై
నిఘా పెట్టాలి వారితో గడపాలి
వారి నిరాశను అలసటను
ప్రేమతో పలకరించాలి
తల్లి తండ్రులు తమ పిల్లలకు
స్నేహితుడై నిలిచి నేను ఉన్నాను
అనే భరోసా భద్రత వాతావరణం సృష్టించాలి
ప్రతి అడుగున అండగా నిలవాలి
మనసులోని మాటలు వినాలి
ఒత్తిడిని దూరం చేసే ఇల్లే
ఒకధైర్యపు కోట అనే నమ్మకం ఇవ్వాలి
డ్రగ్స్ అనే మహమ్మారిని
అడ్డుకోవాలంటే
యుద్ధం ప్రతి ఇంటి నుండే
మొదలవ్వాలి
డ్రగ్స్ పట్ల తల్లి తండ్రుల
జాగరూకతే దేశానికి రక్షణ
కవచం కావాలి
డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో
కుటుంబమే కీలక సూత్రధారి
పిల్లలు మత్తుకు బానిస కాకుండా
తల్లితండ్రులు మమతల కోటలు కట్టాలి
డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు
కుటుంభమే వేదిక కావాలి
తల్లి తండ్రులే పిల్లల భవిష్యత్తుకు
బంగారు బాటలు వేయాలి
ఓ యువతా మత్తును
వీడు ప్రగతిని చూడు
మత్తువద్దు జీవితమే ముద్దు
ఓ యువత మేలుకో
ఉజ్వల భవిష్యత్తును ఏలుకో
వ్యసనాల సంకెళ్లు తెంచి
ప్రగతి బాట పడదాం
మత్తులేని నవ సమాజాన్ని
గర్వంగా నిర్మిద్దాం
ఓయువతా డ్రగ్స్ రహిత
సమాజ స్థాపనకు నడుం కట్టు
ఆరోగ్య భారత్ లక్ష్యంగా
ముందుకు సాగిపో
రెండు తెలుగు రాష్ట్రాల్లో
ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలనకు
ఈగల్ అనే పేరుతో ప్రత్యేక
కార్యాచరణ ప్రవేశ పెట్టడం
అభినందనీయం.



నేదునూరి కనకయ్య




# జనాభా ఆధారంగా పట్టణ విద్యా ప్రణాళిక!



పోరెడ్డి దామోదర్ రెడ్డి

హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ఐటీ నగరంగా ఎదిగింది. ఆకాశహర్మ్యాలు పెరిగాయి. ఫ్లైఓవర్లు విస్తరించాయి. రియల్ ఎస్టేట్ కోట్ల రూపాయల వ్యాపారంగా మారింది. కానీ మహానగరంలో ఒక మౌన సంక్షోభం నెమ్మదిగా పెరుగుతూ వచ్చింది, అదే ప్రభుత్వ విద్య క్షీణత. నగరం ఎంత వేగంగా విస్తరించిందో, ప్రభుత్వ పాఠశాలలు అంతగా విస్తరించలేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు తమ పిల్లల విద్య కోసం ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గత పదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ నిర్లక్ష్యం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతుంది. 2016లో హైదరాబాద్‌లో 684 స్థానిక సంస్థల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 2025--26 నాటికి అవి కేవలం 691 చేరుకున్నాయి. అంటే దాదాపు పదేళ్లలో కేవలం 7 పాఠశాలలే పెరిగాయి.

ఇదే సమయంలో నగర జనాభా లక్షలలో పెరిగింది. కొత్త కాలనీలు, బస్తీలు, వలస కార్మికుల నివాస ప్రాంతాలు విస్తరించాయి. కానీ ప్రభుత్వ విద్య మాత్రం అక్కడికి చేరలేదు. మూడు కార్పొరేషన్లు కలిపి ఏకంగా నగర జనాభా 1.30 కోట్లు.

ఈ ఖాళీని ప్రైవేట్ విద్యాసంస్థలు వేగంగా భర్తీ చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 1,900కు పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 7 లక్షలకు పైగా పిల్లలు చదువుతున్నారు. నగరంలోని దాదాపు 86శాతం పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.

ఇది కేవలం 'తల్లిదండ్రుల ఎంపిక'గా చూడలేం. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, నిరంతర విద్యా వ్యవస్థ లేకపోవడం ప్రజలను ప్రైవేట్ విద్య వైపు నెట్టింది. ప్రైవేట్ పాఠశాలలు ఒక ముఖ్య విషయాన్ని అర్థం చేసుకున్నాయి.

అది- పిల్లలు ఒకసారి చేరితే పదో తరగతి వరకు అదే పాఠశాలలో చదవాలనే తల్లిదండ్రుల ఆకాంక్ష. అందుకే ఎక్కువ ప్రైవేట్ పాఠశాలలు నర్సరీ నుంచి పదో తరగతి వరకు నిరంతర విద్య అందిస్తున్నాయి. కానీ ఇప్పటికీ ఒకచోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మరోచోట ఉన్నత ప్రాథమిక పాఠశాల ఉంటున్నాయి.

పాఠశాలలు మారాల్సి రావడం వల్ల చాలామంది పిల్లలు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. ఇటీవల నీతి ఆయోగ్ కూడా ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు ఒకే పాఠశాలలో పిల్లలు చదివే విధానం అవసరమని చెప్పింది. తెలంగాణ విద్యా కమిషన్ కూడా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఆలోచనను ఇదే నేపథ్యంలో ప్రతిపాదించింది.

మహానగరంలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్లలో ఏర్పడిన 36 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం ప్రకారం, 15 లక్షల జనాభాకు కేవలం 115 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 40 ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. ఈ పాఠశాలల్లో కేవలం 25



వేల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పట్టణ జనాభాలో సరాసరి 13.7శాతం 6 నుంచి 14 సంవత్సరాల బాలలు ఉంటారని ఈ మధ్య జరిగిన కుల గణన సర్వే తెలిపింది. అంటే ఈ 36 డివిజన్లలో 15 లక్షల జనాభాకు 2 లక్షల మంది బడికెళ్లే వయసు బాలలు ఉంటే, కేవలం 25 (12శాతం) వేల మందికి మాత్రమే సరిపడ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అవి కూడా అరకొర వసతులతో నడుస్తున్నాయి.

కుల గణన సర్వే ప్రకారం పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న అధిక శాతం దినసరి కూలీలుగా, నైపుణ్యం లేని కూలీలుగా, వీధులలో చిన్న వ్యాపారాలు చేస్తూ అతి తక్కువ ఆదాయాలతో జీవనం కొనసాగిస్తున్నారు.

జనాభాలో 78.2శాతం మంది సంవత్సరానికి కేవలం రూ.లక్ష కంటే తక్కువ సంపాదించేవారు ఉన్నారని ఈ సర్వేను పరిశీలించిన స్వతంత్ర నిపుణుల బృందం విశ్లేషణ ద్వారా తెలుస్తోంది. ఈ కుటుంబాలన్నీ తీవ్ర వెనుకబాటులో ఉన్న కులాలే అని విశ్లేషించింది. ఈ కుటుంబాల మీద ప్రైవేటు విద్య భారం ఎంత పడుతుందో అర్థం చేసుకోవచ్చు.ఇది కేవలం హైదరాబాద్ సమస్య మాత్రమే కాదు. గ్రామీణ సంక్షోభం, వ్యవసాయ అస్థిరత, ఉపాధి కొరత, జీవన అవకాశాల లోపం వల్ల లక్షలాది కుటుంబాలు నగరాలకు వలస వస్తున్నాయి. కేవలం ఉపాధి కోసమే కాకుండా తమ పిల్లలకు మెరుగైన విద్య లభించాలనే ఆశ వల్ల కూడా ఈ వలసలు జరుగుతున్నాయి. గ్రామాల్లో నాణ్యమైన పాఠశాలలు లేకపోవడం, ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడంతోపాటు, ఇంగ్లీష్ మీడియం, నిరంతర విద్య కోసం తల్లిదండ్రులు నగరాలను ఆశ్రయిస్తున్నారు. కానీ విద్యాశాఖ ఇప్పటికీ గ్రామీణ నమూనాలతోనే పట్టణ విద్యను ప్రణాళిక చేస్తోంది. 'ఒక కిలోమీటర్ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల' అనే పాత ప్రమాణం పట్టణ ప్రాంతాలకు సరిపోదు.

నగరాల్లో జనసాంద్రత చాలా ఎక్కువ. ఉదాహరణకు హైదరాబాద్‌లో ప్రతి చదరపు కిలోమీటర్‌కు సుమారు 15 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇంత భారీ జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో కేవలం దూర ప్రమాణాలతో పాఠశాలల ప్రణాళిక చేయడం వాస్తవ పరిస్థితులకు అనుగుణం కాదు. పట్టణ విద్యా ప్రణాళిక జనాభా ఆధారంగా ఉండాలి.

మన ప్రభుత్వాలు ఇప్పటికే అనేక సేవలను జనాభా ప్రాతిపదికన ప్రణాళిక చేస్తున్నాయి. మద్యం దుకాణాలు, పోలింగ్ బూత్‌లు, ఆరోగ్య సేవలు కూడా జనాభా ఆధారంగానే ఏర్పాటు అవుతున్నాయి. అయితే విద్య విషయంలో మాత్రం ఇప్పటికీ పాత ప్రమాణాలనే కొనసాగిస్తున్నారు. ఇది అత్యంత ఆందోళనకర విషయం.పట్టణ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, మెట్రోలు, ఐటీ టవర్లు కాదు. విద్య కూడా పట్టణ మౌలిక సదుపాయాలలో భాగం కావాలి. ప్రతి కొత్త కాలనీ, పెద్ద హౌసింగ్ ప్రాజెక్ట్, విస్తరిస్తున్న నగర ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల కోసం భూమిని తప్పనిసరిగా కేటాయించాలి.

ఇవి ఎవరి దయాదాక్షిణ్యాలతోనో అందుకునే సేవలు కావు. ఇది పిల్లల రాజ్యాంగ హక్కు. ప్రభుత్వ విద్యను సంక్షేమ కార్యక్రమంలా కాకుండా, పట్టణ ప్రణాళిక, సామాజిక న్యాయ కార్యక్రమంగా చూడాలి.హైదరాబాద్ మహానగరం ఫ్యూచర్ సిటీ, క్యూర్ రీజియన్ భవిష్యత్తు గురించి నిజంగా ఆలోచిస్తే, ప్రభుత్వ విద్య పునర్నిర్మాణం తప్పనిసరి. లేదంటే విద్య పూర్తిగా మార్కెట్ ఆధారిత వ్యవస్థగా మారి, పేద, మధ్యతరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతుంది. కొంతమందిని వెలివేస్తుంది. సమాన అవకాశాల సమాజం నిర్మించాలంటే బలమైన ప్రభుత్వ విద్యా వ్యవస్థే పునాది. కాబట్టి కాలయాపన చేయకుండా విద్యానిపుణులతో తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను పరిశీలించి తక్షణమే పట్టణ విద్యా ప్రణాళికలు తయారు చేయాలి.



శిరీషకు జన్మదిన శుభాకాంక్షలు



మణి చింటూకు జన్మదిన శుభాకాంక్షలు



మాసం గణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు

# 2029లో కాంగ్రెస్ గెలుపుకు - భావజాల మార్పే ప్రత్యామ్నాయం.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్

భారత రాజకీయాల్లో నేడు అత్యంత కీలకమైన ప్రశ్న ఏమిటంటే -- బీజేపీని ఓడించగల శక్తి ఏది? ఈ ప్రశ్నకు చాలామంది కూటములు, కుల సమీకరణాలు, ప్రాంతీయ పార్టీలు, ఎన్నికల వ్యూహాలు వంటి సమాధానాలు చెబుతున్నారు. కానీ గత పదేళ్ల రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. బీజేపీని కేవలం ఎన్నికల గణితంతో ఓడించడం సాధ్యం కాదు. దానికి ఎదురుగా సమగ్ర రాజకీయ దృష్టి, ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం, బలమైన సంస్థాగత నిర్మాణం, దేశ భవిష్యత్తుపై స్పష్టమైన కథనం అవసరం.

2014లో బీజేపీకి సుమారు 31 శాతం ఓట్లు లభించాయి. 2019లో అది 37.4 శాతానికి పెరిగింది. 2024లో కూడా దాదాపు 36.5 శాతం ఓట్లను సాధించింది. అయితే మరో కోణంలో చూస్తే దేశంలోని 60 శాతానికి పైగా ఓటర్లు ఇప్పటికీ బీజేపీకి ఓటు వేయడం లేదు. అంటే రాజకీయంగా ప్రత్యామ్నాయానికి స్థలం ఉంది. సమస్య ఏమిటంటే ఆ ప్రత్యామ్నాయాన్ని విశ్వసనీయంగా నిర్మించగల శక్తి ఇంకా పూర్తిగా ఎదగలేదు.

2024 లోక్‌సభ ఎన్నికలు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చాయి. బీజేపీ స్వంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. 240 సీట్ల వద్ద ఆగిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో గణనీయమైన నష్టం చవిచూసింది. మహారాష్ట్రలో వెనుకబడింది. రైతు ఉద్యమాలు ప్రభావం చూపిన ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు రాలేదు. యువతలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, మధ్యతరగతి ఆర్థిక ఒత్తిడి వంటి అంశాలు అధికార పార్టీకి హెచ్చరికగా మారాయి.

అయితే ఈ పరిస్థితిని కాంగ్రెస్ పూర్తిగా ఎందుకు ఉపయోగించుకోలేకపోయింది? కారణం బీజేపీ బలం మాత్రమే కాదు. కాంగ్రెస్ బలహీనత కూడా. ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉండవచ్చు. కానీ వారు అధికారానికి ప్రత్యామ్నాయంగా ఎవరిని నమ్మాలో కూడా నిర్ణయించుకోవాలి. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఎదురవుతున్న అతిపెద్ద సవాలు ఇదే.

బీజేపీ బలాలను ముందుగా అర్థం చేసుకోవాలి. దేశవ్యాప్తంగా బూత్ స్థాయి వరకు విస్తరించిన కార్యకర్తల నెట్‌వర్క్ దానికి ఉంది. ఆరెస్సెస్, అనుబంధ సంస్థలు, సామాజిక మాధ్యమాల బలమైన వ్యవస్థ, భారీ వనరులు, నిరంతర ప్రచార యంత్రాంగం దానికి తోడుగా ఉన్నాయి. హిందూత్వం, జాతీయ భద్రత, సంక్షేమ పథకాలు, జాతీయ గర్వం వంటి అంశాలను ఒకే రాజకీయ కథనంగా మలచగలిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత ప్రజాదరణ కూడా బీజేపీకి పెద్ద ఆస్తి. అయితే ప్రతి బలానికి ఒక పరిమితి ఉంటుంది.

బీజేపీ బలహీనతలు కూడా తక్కువ కావు. దేశంలో నిరుద్యోగం ఇంకా ప్రధాన సమస్యగానే ఉంది. అనేక సర్వేల ప్రకారం యువ నిరుద్యోగం ఆందోళనకర స్థాయిలో ఉంది. వ్యవసాయ రంగం లాభదాయకంగా మారలేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ధరల పెరుగుదల మధ్యతరగతి, పేద వర్గాలపై ప్రభావం చూపుతోంది. సామాజిక ధ్రువీకరణపై కూడా ఒక వర్గంలో ఆందోళనలు పెరుగుతున్నాయి. అధికార వ్యతిరేకత సహజంగానే పెరుగుతోంది.

ఈ బలహీనతలను రాజకీయ అవకాశాలుగా మార్చుకోవడం కాంగ్రెస్, ఇండియా కూటమి చేతుల్లో ఉంది. అయితే అందుకోసం మొదటగా "మోదీ వ్యతిరేకత" అనే పరిమిత రాజకీయాన్ని




దాటాలి. ప్రజలకు "మేము అధికారంలోకి వస్తే ఏమి చేస్తాం?" అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.

ఇండియా కూటమి గెలవాలంటే ఐదు ప్రధాన అంశాలపై దృష్టి పెట్టాలి. మొదటిది ఉపాధి. దేశంలోని యువతకు ఉద్యోగాలే ప్రధాన సమస్య. ప్రతి సంవత్సరం లక్షలాది మంది డిగ్రీలు పూర్తి చేసి బయటకు వస్తున్నారు. కానీ స్థిరమైన ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. ఉద్యోగ హామీ, తయారీ రంగ విస్తరణ, స్టార్టప్‌ల ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై స్పష్టమైన జాతీయ ప్రణాళికను ప్రకటించాలి.

రెండవది ఆర్థిక అసమానత. దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందనే భావన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి, చిన్న వ్యాపారులు, రైతులు, కార్మిక వర్గాల కోసం ప్రత్యేక విధానాలను రూపొందించాలి. కేవలం సంక్షేమం కాకుండా ఆదాయ వృద్ధి, ఉత్పాదకత పెంపు, స్థానిక పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

మూడవది సంస్థాగత నిర్మాణం. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్యకు వెళ్లే పార్టీలు విజయాన్ని సాధించలేవు. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో, ప్రతి విశ్వవిద్యాలయంలో, ప్రతి సామాజిక వర్గంలో కాంగ్రెస్ తన ఉనికిని పెంచుకోవాలి. ప్రస్తుతం బీజేపీకి ఉన్న సంస్థాగత ఆధిక్యాన్ని తగ్గించడానికి ఇది తప్పనిసరి.

నాలుగవది మహిళలు, యువత. 2024 ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించారు. యువ ఓటర్ల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోంది. ఈ రెండు వర్గాలను రాజకీయంగా ఆకర్షించగలిగిన పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మహిళల భద్రత, ఉపాధి, ఆరోగ్యం, స్వయం సహాయక సంఘాల బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అవసరం.

ఐదవది భావజాల స్పష్టత. కాంగ్రెస్ తరచుగా ప్రతిస్పందనాత్మక రాజకీయాల్లో ఇరుక్కుపోతున్నది. బీజేపీ ఒక అంశాన్ని ముందుకు తెస్తే దానికి సమాధానం చెప్పడానికే పరిమితమవుతోంది. కానీ విజయవంతమైన రాజకీయ పార్టీలు తమ అజెండాను తామే నిర్ణయిస్తాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం, సమాన అవకాశాలు, ఆర్థిక పురోగతి వంటి అంశాల చుట్టూ కొత్త రాజకీయ కథనాన్ని నిర్మించాలి.

రాహుల్ గాంధీ విషయంలో కూడా కొన్ని మార్పులు అవసరం. ఆయన పాదయాత్రల ద్వారా ప్రజలతో అనుబంధం పెంచుకున్నారు. ఇది ఆయనకు రాజకీయంగా లాభం చేకూర్చింది. అయితే ప్రజా నాయకుడిగా కనిపించడం మాత్రమే సరిపోదు. ప్రత్యామ్నాయ ప్రధానమంత్రి అభ్యర్థిగా దేశం ఆయనను చూడాలంటే పరిపాలనా సామర్థ్యం, ఆర్థిక దృష్టి, విదేశాంగ అవగాహన, జాతీయ భద్రత అంశాలపై మరింత స్పష్టత చూపాలి. కేవలం విమర్శలతో కాకుండా పరిష్కారాలతో ముందుకు రావాలి.

అలాగే కాంగ్రెస్‌లో కొత్త నాయకత్వాన్ని ఎదగనివ్వాలి. కుటుంబ ఆధారిత పార్టీ అనే విమర్శను అధిగమించాలంటే యువ నాయకులకు, ప్రాంతీయ నాయకులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల వారీగా బలమైన నాయకత్వాన్ని నిర్మించాలి. కర్ణాటకలో కనిపించిన నమూనాను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలి.

ప్రాంతీయ పార్టీలతో సంబంధాల విషయంలో కూడా కాంగ్రెస్ కొత్త విధానాన్ని అవలంబించాలి. ఆధిపత్య ధోరణి కాకుండా భాగస్వామ్య రాజకీయాలు అవసరం. భారతదేశం వైవిధ్యభరిత దేశం. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక రాజకీయ, సామాజిక, ఆర్థిక అవసరాలు ఉంటాయి. వాటిని గౌరవించే సమాఖ్య రాజకీయ సంస్కృతి ఇండియా కూటమికి బలం అవుతుంది.

భారత రాజకీయాల భవిష్యత్తు కేవలం మోదీ వర్సెస్ రాహుల్ పోటీ కాదు. అది రెండు రాజకీయ దృష్టికోణాల మధ్య పోటీ. బీజేపీ తన కథనాన్ని నిర్మించుకుంది. ఇప్పుడు కాంగ్రెస్, ఇండియా కూటమి దేశ భవిష్యత్తుపై మరింత శక్తివంతమైన కథనాన్ని నిర్మించగలిగితేనే 2029లో నిజమైన సవాలు విసరగలదు. ప్రత్యర్థి బలహీనత కోసం ఎదురు చూడడం కాదు; ప్రజల ఆశయాలకు ప్రతినిధిగా మారడం ద్వారా మాత్రమే విజయం సాధ్యమవుతుంది.

చరిత్ర చెబుతున్న గొప్ప పాఠం ఇదే. ఏ పార్టీ శాశ్వత విజేత కాదు. ఏ పార్టీ శాశ్వత పరాజితురాలు కూడా కాదు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నవారే చివరకు అధికారాన్ని గెలుస్తారు. బీజేపీని ఓడించగల శక్తి కేవలం కూటమి కాదు, కేవలం నాయకత్వం కాదు, కేవలం ఎన్నికల వ్యూహం కాదు. ప్రజలకు ఆశను, దిశను, ప్రత్యామ్నాయ భవిష్యత్తును చూపగల భావజాలమే అసలు శక్తి.



## గిన్నె వర్షిత కు జన్మదిన శుభాకాంక్షలు

## సరైన ఓటరు జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి పునాది!



**జనసైన్యం సిటి**

రేపటి నుండి ప్రారంభం అవుతున్న SIR కార్యక్రమంలో బిజెపి పార్టీ నుండి నియమించబడ్డ దీూా2 లు మీ మీ గ్రామాల BLO/BLA లతో భాగస్వామ్యం అవుతూ అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలని దొంగ ఓట్లను లేకుండా చూసే బాధ్యతల్లో నిమగ్నమై పనిచేయాలని అసెంబ్లీ SIR ప్రోగ్రాం బిజెపి కోహెడ మండల్ ఎస్టి మోర్చా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. బానోతు సురేష్ నాయక్ మాట్లాడుతూ SIR కార్యక్రమంపై కొన్ని పార్టీలు చేసే అపోహలను విడనాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో, ఓటరు జాబితాలు కచ్చితంగా మరియు పారదర్శకంగా ఉండటం కూడా అంతే ముఖ్యం. SIR కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా రూపొందించడం. కాలక్రమేణా మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలు వంటి అంశాలను పరిశీలించి సరిచేయడం అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడడం, ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా మరియు విశ్వసనీయంగా మార్చడం ఈ కార్యక్రమం లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన అవకాశాలు మరియు విధానాలు అందుబాటులో ఉంటాయిప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలి. అవసరమైతే సంబంధిత అధికారులకు కావాల్సిన సమాచారం అందించి తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి.బలమైన ప్రజాస్వామ్యానికి స్వచ్ఛమైన ఓటరు జాబితాలు అవసరం. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలి సరైన ఓటరు జాబితా – బలమైన ప్రజాస్వామ్యానికి పునాది కాబట్టి అందరు సహకరించాలని కోరారు.

## సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కార్యదర్శిగా జక్కుల రమేష్ యాదవ్




**జనసైన్యం సిటి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కార్యదర్శిగా జక్కుల రమేష్ యాదవ్ ఎన్నికయ్యారు. గురువారం రోజున ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జమ్మికుంట మండల జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ వడ్లూరి కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరు వాసుదేవ రెడ్డి హాజరయ్యారు.నూతనంగా ఎన్నికైన జక్కుల రమేష్ మాట్లాడుతూ మండల కార్యదర్శిగా తనను ఎంపిక చేసిన జిల్లా నాయకత్వానికి, మండల నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జమ్మికుంట మండలంలో పార్టీని, ప్రజాసంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేంతవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు.మండలంలో ప్రజానీకం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, సమస్యల పరిష్కారం కొరకు మండల కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్ మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, కన్నం సదానందం, గడ్డం శోభన్, రావుల ఓదెలు, దాసరి మొగిలి, మండల నాయకులు, మధునయ్య, పోచయ్య, చేలిక ప్రసాద్, రాచపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి




అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాల్గవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.కలెక్టరేట్ ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, నర్సింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం (నాటిక), అవగాహన గీతాలు ప్రజలను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి.

అంధకారంలోకి భవిష్యత్తు – స్కిట్ ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శన: ర్యాలీ అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని 'అస్త్ర కన్వెన్షన్ హాలు' నందు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌ను విద్యార్థులకు ప్రదర్శించారు. అనంతరం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయి, కుటుంబాలు ఎలా నాశనమవుతాయనే విషయాన్ని కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శన ద్వారా డ్రగ్స్ రహిత సమాజంపై చక్కని సందేశాన్ని ఇచ్చారు. ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలపై దృష్టి పెట్టండి: సిపి గౌష్ ఆలం సదస్సులో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి మాదకద్రవ్యాల దుర్వినియోగం (డ్రగ్ అబ్యూస్) అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకూడదని హితవు పలికారు. చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా, స్పోర్ట్స్, శారీరక వ్యాయామం (ఫిజికల్ యాక్టివిటీ) పై దృష్టి సారించాలని సూచించారు.కరీంనగర్ జిల్లాను డ్రగ్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల విద్యాసంస్థల పరిసరాల్లోని (100 మీటర్ల లోపు) 99 పాన్ షాపులపై దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 52 కేసులు నమోదు చేసినట్లు గుర్తుచేశారు. కమీషనరేట్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో 'కాన్షియస్ క్లబ్స్' (జశీఅంఎఱశీబం జశ్రీబఎం) ఏర్పాటు చేశామని తెలిపారు. "SAY NO TO DRUGS - SAY YES TO LIFE" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి సేవించడం, విక్రయించడం 'ఎన్.డి.పి.ఎస్ (NDPS) యాక్ట్ – సెక్షన్ 27' ప్రకారం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, దీనివల్ల భవిష్యత్తు సర్వనాశనమవుతుందని హెచ్చరించారు.

స్వీయ నియంత్రణే శ్రీరామరక్ష: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. అయితే, అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, యువతలో 'స్వీయ నియంత్రణ' ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి, తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం – ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ: ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు సిపి గౌష్ ఆలం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు, విద్యార్థులందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'సంతకాల సేకరణ బోర్డు'పై సీపీతో పాటు ఇతర అతిథులు, అధికారులు సంతకాలు చేసి, కరీంనగర్‌ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు.ఈ సదస్సులో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి (DWO) సరస్వతి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (DCPO) పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి,ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ఇతర పోలీస్, ఎక్సైజ్ అధికారులు మరియు వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జూన్ 25.. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత చీకటి రోజు




భారత ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 25వ తేదీ అత్యంత భయానకమైన 'చీకటి రోజు' లాంటిదని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం , ప్రధాని ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశంలో ఎమర్జెన్సీ విధించి విధ్వంసాన్ని సృష్టించిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో ఎమర్జెన్సీ దినోత్సవ వేడుకలను బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడి, జైలు శిక్షను అనుభవించిన పోరాట యోధులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ మేకల ప్రభాకర్ యాదవ్ , బిజెపి నాయకులు కార్యకర్తలు కలిసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 1975 జూన్ 25న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రధాని విధించిన అత్యవసర పరిస్థితి భారత దేశానికి గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. స్వతంత్ర భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం అన్నారు. ఎమర్జెన్సీ సందర్భంగా నాటి పాలకుల అహంకారంతో అత్యంత దారుణంగా ప్రజాస్వామ్యాన్ని రద్దు చేసి రాజ్యాంగాన్ని వారికి కావలసిన విధంగా మార్చుకొని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది నాయకులు, కార్యకర్తలను జైళ్లలో బంధించి, పత్రికా స్వేచ్ఛను హరించి, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాశారన్నారు.. ముఖ్యంగా ఎన్నికల్లో అక్రమాలు పాల్పడినందుకు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగన్మోహన్ లాల్ సిన్హా ఆ రోజుల్లో ఇందిరాగాంధీని పదవి నుంచి దిగిపోవాలని ఆదేశించిందని, ఎన్నికల్లో పాల్గొనకుండా ఆరేళ్లపాటు నిషేధం విధించిందన్నారు. ఆ తీర్పును జీర్ణించుకోలేకనే ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇన్ని దారుణాలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజాస్వామ్యం ఆపదలో ఉందని చెప్పడం హాస్యాస్పదంగా, విడ్డూరంగా ఉందన్నారు. అందుకే జూన్ 25 అనేది భయానకమైన చీకటి రోజు అని, ఆ కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన యోధుల త్యాగాలను మనం ఎప్పటికీ మరువలేమన్నారు.. నేటి యువతకు, భావితరాలకు అప్పటి దారుణ పరిస్థితులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని, ఆ దిశలోనే బిజెపి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎమర్జెన్సీ దినోత్సవ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు, ప్రోగ్రాం కన్వీనర్ మేకల ప్రభాకర్ యాదవ్, పార్లమెంట్ కన్వీనర్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ,జిల్లా ఉపాధ్యక్షులు కళ్ళెం వాసుదేవ రెడ్డి, కన్నా కృష్ణ, సీనియర్ నాయకులు గుజ్జశ్రీనివాస్ రావు, పుప్పాల రఘు, అలివెల్లి సమ్మి రెడ్డి, కార్పోరేటర్ బండ రమణ రెడ్డి, అనిల్, అడిచెర్ల రాజు, మండల అధ్యక్షులు బండారి గాయిత్రి ,తనుకు సాయికృష్ణ, రవీందర్, దాసరి రమణారెడ్డి ,ఈసంపల్లి మహేష్ తిరుమల్ రెడ్డి ,వంగల ఆంజనేయులు, వాసు తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి



**జనసైన్యం సిటి**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబోమని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.గురువారం మానకొండూరు మండలం ముంజంపల్లి గ్రామంలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రక్షాళన చేయడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. మానకొండూరు నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాలకు 316 మంది బీఎల్వోలు, 32 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 2,26,250 మంది ఓటర్లు ఉండగా, వారిలో రెండు లక్షల మందికి పైగా ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. సుమారు 24 వేల మంది ఓటర్ల మ్యాపింగ్ ఇంకా జరగాల్సి ఉండగా, 47 వేల మంది ఓటర్ల మ్యాపింగ్‌లో సవరణలు అవసరమని గుర్తించినట్లు వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మ్యాపింగ్ డేటా ఆధారంగా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించి, ఓటర్లకు ముద్రిత ప్రతులను అందజేస్తారని చెప్పారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని బీఎల్వోలకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ లో పాల్గొని పర్యవేక్షించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**జనసైన్యం సిటి**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)నగరంలోని 47 వ డివిజన్ లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.అసలైన ఓటరు ఏఒక్కరికి అన్యాయం జరుగవద్దని మ్యాపింగ్ కాని ఓటర్ల నమోదుతో పాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ బిఎల్ఏ లు దగ్గరుండి చూసుకోవాలని మ్యాపింగ్ అయిన వారి ఎన్యుమరేషన్ పత్రాలు దగ్గరుండి నింపించి బి ఎల్ వో ద్వారా అప్ లోడ్ చేపించాలి ఎన్యూమరేషన్ ఫామ్ నింపించి ఇవ్వకపోతే డ్రాఫ్ట్ లిస్ట్ లో ఓటు నమోదు కాదు అందుకని తప్పకుండా ప్రతి ఎన్యూమరేషన్ ఫామ్ తప్పకుండా నింపించి ఇవ్వాలని బి ఎల్ ఏ లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్,బిఎల్ వో సునీత,బిఎల్ వో సూపర్ వైజర్ జమున,శ్రీనివాస్ గౌడ్,కేశవ రెడ్డి,గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్

కొడిమ్యాల, జన సైన్యం న్యూస్



కొడిమ్యాల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను తహసీల్దార్ డి. నరేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, మెస్ నిర్వహణ, వంటశాల, ఆహార పదార్థాల నిల్వ విధానం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణ పరిశుభ్రతతో పాటు విద్యార్థినులకు అందిస్తున్న వసతులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.తనిఖీలో భాగంగా తహసీల్దార్ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారాన్ని పరిశుభ్రంగా, నాణ్యంగా తయారు చేసి వడ్డిస్తున్న సిబ్బందిని అభినందించారు.విద్యార్థినులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేందుకు పాఠశాల సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు.భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పరిశుభ్రత, ఆహార నాణ్యత, రికార్డుల నిర్వహణలో ఉన్నత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థినుల ఆరోగ్యం, సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించడంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా తహసీల్దార్ డి. నరేష్ పేర్కొన్నారు.

# రన్నింగ్ కాలమ్



తెలంగాణలో మొదలు
ఓట్ల సవరణ ప్రక్రియ
ముగిసాకే తెలుస్తుంది
తప్పొప్పుల ప్రతిక్రియ

ఎన్నికల కమీషనంటే
కేంద్రంవారి కీలుబొమ్మ
ప్రతిపక్షానికి చూపిస్తోంది
దిమ్మతిరిగే తోలుబొమ్మ

-పెనుగొండ బసవేశ్వర్..

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి




**జనసైన్యం సిటి**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ నగరంలోని 46వ డివిజన్ ప్రగతినగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారు.. ఎన్ని గంటలకు ప్రారంభించారు. కార్యాచరణ ప్రణాళిక ఎలా రూపొందించుకుంటు న్నారు. త్వరగా పూర్తి చేయడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు అని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఓటర్లతోనూ మాట్లాడారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించుకుంటే కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అవసరమైతే ఇతర శాఖల సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తామని కలెక్టర్ తెలిపారు. మహిళా సంక్షేమ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది సేవలను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక నిర్దిష్ట షెడ్యూల్, ప్రణాళిక ప్రకారం ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని, అర్హులైన ప్రతి ఓటరుకు సమాచారం చేరేలా చూడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ రాజేష్, సంబంధిత అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## కొడిమ్యాల మండలంలో ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభం



కొడిమ్యాల, జన సైన్యం న్యూస్.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్--2026 (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం గురువారం కొడిమ్యాల మండలంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలంలోని బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఎస్ఐఆర్-2026 కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్లు, దరఖాస్తు ఫారాలు, ఇతర ఎన్నికల సామగ్రిని తహసీల్దార్ డి. నరేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం బీఎల్ఓలు, సూపర్వైజర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటింటికి ఓటర్లను కలుసుకుంటూ షెడ్యూల్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ డి. నరేష్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి కార్యక్రమం అమలును పరిశీలించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను బీఎల్ఓలు కచ్చితంగా పాటించాలని, ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు షెడ్యూల్లు అందజేసి అవసరమైన వివరాలు సేకరించాలని, కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని బీఎల్ఓలకు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. అవసరమైన పత్రాలు, వివరాలను సమర్పించి తమ ఓటరు నమోదు వివరాలను ధృవీకరించుకోవడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని తహసీల్దార్ పిలుపునిచ్చారు.

## పచ్చునూర్ లో న్యూమరేషన్ ఫారం స్వీకరించిన ఎమ్మెల్యే దంపతులు



**జనసైన్యం సిటి**

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ తన స్వగ్రామం పచ్చునూరులో గురువారం ఎనిమరేషన్ పారాన్ని అధికారుల నుంచి తీసుకున్నారు. పచ్చునూరు , గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సర్) నిర్వహించిన సందర్భంగా ఆయన తన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధతో కలిసి ఎంఆర్వో, బీఎల్ఏలు, బీఎల్వోల నుంచి ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడు భాగస్వామి కావాలని, తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన బాధ్యతను గుర్తించి ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, బీఎల్ఏలు, బీఎల్వోలతో కార్యక్రమం నిర్వహణపై వివరాలు తెలుసుకుని, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

## కొండగట్టు గిరిప్రదక్షిణ భక్తులకు సౌకర్యవంతమైన కొత్త మార్గం త్వరలో ఏర్పాటు.



కొండగట్టు, జన సైన్యం న్యూస్.

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి గిరిప్రదక్షిణ నిర్వహించే భక్తులకు శుభవార్త అందింది. గిరిప్రదక్షిణ సందర్భంగా ఘాట్‌రోడ్డు నుంచి పైకి వెళ్లే మార్గంలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, శ్రీ సురేష్ ఆత్మహరం మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించారు.భక్తుల కోరిక మేరకు ఘాట్‌రోడ్డు కొంతదూరం వెళ్లిన తర్వాత ఎడమ వైపు నుంచి ప్రారంభమయ్యే ఈ కొత్త మార్గం చెట్ల మధ్య సహజసిద్ధమైన వాతావరణంలో కొనసాగుతూ, పురాతన బుగ్గబావి నుంచి బొజ్జపోతన దేవాలయం వరకు చేరుకునేలా రూపొందించబడుతోంది. ఈ మార్గం ద్వారా గిరిప్రదక్షిణ చేసే భక్తులు మరింత సౌకర్యవంతంగా, ప్రశాంతంగా తమ యాత్రను కొనసాగించవచ్చని నిర్వాహకులు తెలిపారు.ప్రస్తుతం జరగనున్న పౌర్ణమి సందర్భంగా 42వ కొండగట్టు గిరిప్రదక్షిణ నిర్వహించనున్నారు.అనంతరం 43వ గిరిప్రదక్షిణ వరకు ఈ కొత్త మార్గాన్ని పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు శ్రీ సురేష్ ఆత్మహరం మహారాజ్ వెల్లడించారు.కొండగట్టు అంజన్న స్వామివారి కృపతో గిరిప్రదక్షిణలో పాల్గొనే ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని, ఈ కొత్త మార్గాన్ని వినియోగించుకుని సురక్షితంగా యాత్రను పూర్తి చేయాలని నిర్వాహకులు కోరారు.జై శ్రీరామ్... జై వీరాంజనేయ స్వామి!

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా నగరంలోని 33వ డివిజన్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ హీనా ఆఫ్రిన్, కో-ఆప్షన్ సభ్యులు నందకుమార్, బల్బీర్ సింగ్, ఎం.డి. ముజీబ్, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం 58వ డివిజన్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నిర్మించనున్న కాంపౌండ్ వాల్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ , పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గారితో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కూడా నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు సర్దార్ రవీందర్ సింగ్, చంద్ర, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.